





పండించలేకపోతున్నాం..

ప్రస్తుత పరిస్థితుల్లో చెరకు సాగు చేపట్టలేకపోతున్నాం. లచ్చయ్యపేట చక్కెర ఫ్యాక్టరీ నడిచినప్పుడు పంటను తరలించడానికి వీలుగా ఉండేది. అవసరమైతే నాటుబళ్లతోనైనా చెరకు సప్లై చేసుకోగలమని ధైర్యం ఉండేది. అయితే యాజమాన్యం బకాయిలు సకాలంలో చెల్లించకపోవడం, వైసీపీ ప్రభుత్వం సరిగ్గా పట్టించుకోకపోవడంతో కార్మాగారం మూతపడింది. దీంతో మాకు కష్టాలు మొదలయ్యాయి. సుదూరంలో ఉన్న సంకిలి ఫ్యాక్టరీకి పంటను తరలించాలంటే తడిసిమోపె డవుతోంది. లేబర్, రవాణా చార్జీలను తట్టుకోలేక పోతున్నాం. అవసరమైన సమయంలో వాహనాలు రాకపోవడం, చెరకు ఆరిపోవడం వంటి సమస్యలెన్నో ఎదుర్కొంటున్నాం. దీంతో చెరకును పండించలేకపోతున్నాం.

-బొత్స సింహాచలం, చెరకు రైతు, లచ్చయ్యపేట



చార్జీల భారం..

విజయనగరం జిల్లాలో సంకిలి ఫ్యాక్టరీకి చెరకు పంటను పంపించాలంటే మాపై అధికంగా చార్జీల భారం పడుతుంది. నరికిన చెరకు సరైన సమయంలో ఫ్యాక్టరీకి వెళ్లడం లేదు. మరోవైపు రవాణా, లేబర్ చార్జీలను భరించాల్సి వస్తుంది.

-ఉరదండ లక్ష్మం, రైతు, లక్ష్మీపురం



ఆందోళనలు చేపట్టినా..

2018లో ప్రతిపక్ష నేత జగన్ జిల్లాలో పాదయాత్ర చేసిన సమయంలో లచ్చయ్యపేట ఫ్యాక్టరీకి పూర్వవైభవం చేస్తామని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటనే మరిచారు. పైగా ఫ్యాక్టరీ మూతపడేలా చేశారు. కర్మాగారాన్ని వైసీపీ ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని నడిపించాలని రైతులు, కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టినా స్పందించలేదు. ఇది చాలా బాధాకరం.

-రెడ్డి లక్ష్మంనాయుడు,
రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ఆ హామీ ఏమైంది?

- లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తీసుకొస్తామన్న జగన్
- చెరకు రైతులు, కార్మికులను ఆదుకుంటామని పాదయాత్రలో మాటిచ్చిన వైనం
- అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఆ ఊసే ఎత్తని ముఖ్యమంత్రి
- చివరకు మూతపడిన చక్కెర కర్మాగారం
- ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని నడిపించాలని అప్పట్లో ప్రజాసంఘాలు ఆందోళన
- వీధిన పడిన కార్మిక కుటుంబాలు... చెరకు సాగుకు దూరమైన రైతులు
- పట్టించుకోని వైసీపీ సర్కారు.. వలసబాటలో ఎంతోమంది..

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి/సీతానగరం)

'అధికారంలోకి వచ్చిన వెంటనే పార్వతీపురం నియోజకవర్గం సీతానగరం మండలం లచ్చయ్యపేటలో ఉన్న ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారానికి పూర్వవైభవం తెస్తాం. కార్మికులు, చెరకు రైతులను ఆదుకుంటాం' అని జిల్లాలో పాదయాత్ర చేపట్టిన సమయంలో ప్రతిపక్ష నేతగా జగన్ హామీ ఇచ్చారు. అయితే పాలనా పగ్గాలు చేపట్టి ఐదేళ్ల గడిచినా... ఇంకా ఆ హామీని నెరవేర్చలేదు. రైతులు, కార్మికులను పట్టించుకునే లేదు. పైగా వైసీపీ ప్రభుత్వ పాలనలోనే ఈ కార్మాగారం మూతబడింది. దీంతో ఎంతోమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కోల్పోయారు. కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అత్యధికంగా రైతులు చెరకు సాగుకు స్వస్తి చెప్పారు. మరికొందరు పొట్ట చేతపట్టుకుని వలసబాట పట్టారు. మొత్తంగా 'మాట తప్పను.. మడమ తిప్పను' అని గొప్పలు చెప్పుకునే సీఎం జగన్.. చక్కెర కర్మాగారంపై ఇచ్చిన హామీని గాలిలో కలిపేశారు. కార్మికులు, రైతులకు నిరాశే మిగిల్చారు.

ఇదీ పరిస్థితి..

వాస్తవంగా పార్వతీపురం, సాలూరుతో పాటు విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గాల్లో రైతులకు లచ్చయ్యపేట ఎన్ఎసీఎస్ చక్కెర కర్మాగారం అత్యంత కీలకం. గతంలో 16 మండలాల రైతులు సుమారు 9 వేల ఎకరాల్లో చెరకు సాగు చేపట్టేవారు. తమ పంటను నేరుగా సీతానగరానికి సమీపంలో ఉండే ఈ కర్మాగారానికి తరలించేవారు. అంతా బాగుందనుకున్న తరుణంలో.. ఊహించని పరిణామం చోటుచేసుకుంది. చెరకు బిల్లులు సకాలంలో రైతులకు చెల్లించలేకపోవడం వల్ల 2021లో ఫ్యాక్టరీ మూతబడింది. ఆ సమయంలో చెరకు రైతులు, కార్మికులను ఆదుకోవాలని, ఫ్యాక్టరీని ప్రభుత్వమే నడిపించాలని ప్రజా, రైతు సంఘాల నాయకులు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. అయినా వైసీపీ ప్రభుత్వం కనికరించలేదు. పైగా రైతులకు చెల్లించాల్సిన బకాయిల పేరుతో ఆర్ఆర్ యాక్ట్ కిందట ఎన్‌సీఎస్ భూములను సైతం విక్రయించారు. ఇదే సమయంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా ఫ్యాక్టరీ మూతపడడంతో ఉమ్మడి జిల్లాలో చెరకు సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రైతులు నాలుగు వేల ఎకరాల్లోనే సాగు చేపడుతున్నారు. విజయనగరం జిల్లా సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి వారు తమ పంటను తరలించాల్సి వస్తోంది. దీనివల్ల వ్యయప్రయాసాలకు గురికావల్సి వస్తోంది. దూరాభారంతో పాటు రవాణా, లేబర్ చార్జీలు అధికం కావడంతో రైతుకు గిట్టుబాటు కావడం లేదు. దీంతో చెరకు సాగు చేపట్టడం, ఫ్యాక్టరీకి తరలించడం అన్నది వారికి భారంగా మారింది. మరోవైపు ఈ ప్రాంతంలో అత్యధిక మెట్టు భూములే ఉండడం, సాగునీరు లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా మరే పంటను పండించలేకపోతున్నారు. దీంతో చాలామంది కుటుంబాలతో వలస బాట పడుతున్నారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో..

ఉమ్మడి జిల్లాలో చెరకు రైతులు, కార్మికులు రోడ్డున పడకుండా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పెద్దలు, అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. చక్కెర కర్మాగార యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి ఫ్యాక్టరీ పనిచేసే విధంగా చూశారు. అప్పట్లో ఫ్యాక్టరీ నుంచి రైతులకు బకాయిలు చెల్లించేలా చొరవ చూపి కొంతవరకు సఫలీకృతులయ్యారు. కర్మాగారాన్ని మూసివేస్తామని యాజమాన్యం మొండిపట్టు పట్టినప్పుడు తెలుగుదేశం నాయకులు, ప్రజాప్రతినిధులు ససేమిరా అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి ఈ విషయం తీసుకెళ్లి.. ఫ్యాక్టరీ నడిపించేలా చేశారు. దీనివల్ల కార్మికులు, చెరకు రైతులకు ఎంతో మేలు జరిగిందని చెప్పొచ్చు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో సుమారు 9 వేల ఎకరాలకు పైబడి చెరకు పంట సాగయ్యేది. సుమారు 300 మంది కార్మికులు ఉపాధి పొందేవారు. ఫ్యాక్టరీ నడిచే సమయంలో ఎంతోమంది చిరు వ్యాపారులు చేసుకుంటూ జీవనం సాగించేవారు.

వైసీపీ పాలనలో..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. ఫ్యాక్టరీని నడిపించేలా చూడాల్సిన సర్కారు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకొస్తామన్న హామీని మరిచి మూతపడేలా చేశారు. బకాయిల కోసం ఫ్యాక్టరీకి చెందిన సుమారు 91 ఎకరాలను వేలం వేయించారు తప్ప రైతులు, కార్మికులకు చేసిందేమీ లేదు. అసలు వారి గోడును సైతం పట్టించుకోలేదు. ఫ్యాక్టరీ భూముల విక్రయాల్లో కూడా అధికార పార్టీకి చెందిన కొంతమంది ప్రధాన నాయకులు తెరవెనుక ఉండి అంతా నడిపించారనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. ఈ కారణంగానే తక్కువ ధరకే భూముల విక్రయాలు జరిగాయనే వాదనలు కూడా లేకపోలేదు. ఏదేమైనా ఫ్యాక్టరీ మూతపడడంతో ప్రస్తుతం చెరకు రైతులు, కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. దీనంతటికీ కారణం వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యమేనని ఆయా ప్రాంతవాసులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కొత్త పరిశ్రమల స్థాపనకు ఐదేళ్ల కాలంలో వైసీపీ సర్కారు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కనీసం జిల్లాలో ఉన్న పరిశ్రమను సైతం నడిచేలా చేయకపోవడంపై జిల్లావాసులు మండిపడుతున్నారు. మొత్తంగా లచ్చయ్యపేట ఎన్ఎసీఎస్ చక్కెర కర్మాగారం మూతపడేలా చేసిన పాపం వైసీపీదేనంటూ ఆయా ప్రాంతవాసులు పెదవి విరుస్తున్నారు.



మూతపడిన లచ్చయ్యపేట చక్కెర కర్మాగారం

మూడో రోజు.. రెండు నామినేషన్లు

పార్వతీపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం మూడో రోజు రెండు నామినేషన్లు మాత్రమే దాఖల య్యాయి. అరకు పార్లమెంట్ నియోజక వర్గానికి సంబంధించి స్వతంత్ర అభ్యర్థిగా పి.రంజిత్‌కుమార్ కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందించారు. కురుపాం అసెంబ్లీ నియోజ కవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా మోటారు నాగభూషణ్ నామినేషన్ దాఖలు చేశారు.

నేడు సెలవు

సాలూరు రూరల్: ఈ నెల 21న ఆదివారం సెలవు కావడంతో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఉండదని సాలూరు ఏఆర్వో సింహాచలం శనివారం తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో నామినేషన్ల స్వీకరణ ఉండబోదనేది నోటిఫికేషన్‌లో వివరించినట్లు చెప్పారు.

పక్కాగా పరిశీలన

పార్వతీపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ , వీడియో వ్యూయింగ్ బృందాలు పక్కాగా పరిశీలించాలని అరకు పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు గురుకరుణ్‌సింగ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయా బృందాలతో సమీక్షించారు. అభ్యర్థుల ప్రచార ర్యాలీలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం వ్యయ నమోదులో పాటిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. జేసీ శోభిక, వ్యయ విభాగం నోడల్ అధికారి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



విద్యుత్ కోతల్లేకుండా చూడండి

- ఆర్వో కల్పనాకుమారి

సీతంపేట: ఎన్నికల దృష్ట్యా స్ట్రాంగ్ రూం, రిటర్నింగ్ అధికారి కార్యాలయాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి సూచించారు. శనివారం సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సంబంధిత విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడారు. పాలకొండలోని స్ట్రాంగ్ రూం వద్ద ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్, కమిషనింగ్, పోలింగ్ ముందు రోజు డిస్ట్రిబ్యూష్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ఈ నెల 25 వరకు నామినేషన్ ప్రక్రియ ఉంటుందని, విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా మూడో రోజు నామినేషన్లు పడలేదని ఆమె తెలిపారు. ఇప్పటివరకు ఒక్క నామినేషన్ నమోదైందన్నారు. ఈ సమావేశంలో డీడీ అన్నదొర, విద్యుత్ శాఖ ఈఈ గోపాలకృష్ణ, ఏఈ నీలిమ తదితరులున్నారు.

విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడుతున్న ఆర్వో కల్పనాకుమారి

కొబ్బరి చెట్టుపై పిడుగు



కొమరాడ మండలం చినఖర్దేల గ్రామంలోని ఓ కొబ్బరి చెట్టుపై శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పిడుగుపడింది. దీంతో ఆ చెట్టుకు మంటలు చెలరేగాయి. అయితే ఒక్కసారిగా పిడుగు శబ్దం విన్న గ్రామస్థులు భయాందోళన చెందారు. జనావాసాల మధ్యలోనే ఉన్న చెట్టుకు అంటుకున్న నిప్పును చూసి బెంబేలెత్తిపోయారు. అయితే ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమవగా.. ఉరుములు, మెరుపులకు ఆ ప్రాంతవాసులు ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రాలేకపోయారు. ఆ తర్వాత సుమారు గంట పాటు వర్షం కురిసింది. మరోవైపు జిల్లావ్యాప్తంగానూ చిరుజల్లులు పడ్డాయి. అక్కడక్కడా ఓ మోస్తరు వాన కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ఎండవేడి, ఉక్కపోత నుంచి జిల్లావాసులు కాస్త ఉపశమనం పొందారు.

- కొమరాడ

వైసీపీ నాయకుడిపై కేసు నమోదు

- అనుమతుల్లేకుండా ఎన్నికల ప్రచార సామగ్రి తరలింపు

పార్వతీపురం రూరల్: వైసీపీకి చెందిన పార్వతీపురం మండల నేతపై కేసు నమోదైంది. అనుమతుల్లేకుండా ఎన్నికల ప్రచార సామగ్రి తీసుకెళ్తున్న ఆయనపై అధికారులు ఫిర్యాదు చేయడంతో కేసు ఫైల్ చేశారు. పార్వతీపురం రూరల్ ఎస్ఐ దినకరన్ చెప్పిన వివరాల ప్రకారం.. చిన్నబండపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఇదే సమయంలో వైసీపీ మండల అధ్యక్షుడు బి.రమేష్ కారును కూడా వారు పరిశీలించారు. అయితే అందులో ఉన్న వైసీపీ జెండాలు, సీఎం జగన్ ఫొటోతో ఉన్న 20 చేతి వాచీలు, ఇతరత్రా ఎన్నికల ప్రచార సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని అనుమతులు లేకుండా తీసుకెళ్తున్నట్లుగా గుర్తించారు. దీనిపై స్క్వాడ్ టీమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాహన యజమాని రమేష్‌తో పాటు ఆయన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

మన్యంలో మలేరియా

- దోనుబాయి పరిధిలో ఎనిమిది కేసులు నమోదు

సీతంపేట: దోనుబాయి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల్లో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. గడిచిన వారం రోజులుగా గడ్డికారం, మానాపురం, కారుమానుగూడ, ఈతమానుగూడ, ఇప్పమానుగూడ, రాయికురిడి గ్రామాలకు చెందిన వారు సీతంపేట ఏరియా ఆసుపత్రికి క్యూ కడుతున్నారు. వారంతా జ్వరంతో బాధపడుతుండడంతో వైద్యసిబ్బంది రక్త పరీక్షలు చేయగా, ఎనిమిది మందికి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో వీరందరికీ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. దీనిపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావును వివరణ కోరగా.. దోనుబాయి ప్రాంతం నుంచే మలేరియా కేసులు నమోదు అవుతున్నట్లు తెలిపారు.

అడుగంటిన 'తోటపల్లి'

పార్వతీపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ సాగునీటి ప్రాజెక్టు తోటపల్లిలో నీటిమట్టం బాగా తగ్గింది. ఫుల్ రిజర్వాయర్ లెవెల్ 105 మీటర్లు కాగా శనివారం నాటికి 102.77 మీటర్ల మేర నీటి నిల్వలు ఉన్నాయి. గురుగుబిల్లి మండల పరిధిలో ఉన్న ఏకైక మేజర్ ప్రాజెక్టు తోటపల్లి ఈ స్థితికి చేరుకోవడంపై రైతులు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జిల్లాతో పాటు ఒడిశాలోనూ వర్షాలు కుర వడం లేదు. మే నెలలో కూడా ఇదే పరిస్థితి కొనసాగితే నాగావళి నది పూర్తిగా అడుగంటే అవకాశం ఉంది. ఇదే జరిగితే సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పవని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పార్వతీపురం పట్టణవాసులు తాగునీటికి కటకటలాడుతున్నారు. అధిక ఎండల నేపథ్యంలో ముున్ముందు పరిస్థితేమిటోనని రైతులు, ప్రజలు టెన్షన్ పడుతున్నారు.

తాలాడలో ఏనుగులు



తాలాడ పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

భామిని: భామిని మండలం తాలాడ ప్రాంతంలో ఏనుగులు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఉదయం వరకు అవి పంట పొలాల్లోనే సంచరించాయి. అక్కడ విశ్రాంతి తీసుకున్న ఏనుగులు సాయంత్రానికి గ్రామ సమీపంలోకి రావడంతో తాలాడ వాసులు హడలెత్తిపోయారు. ఆ గ్రామానికి అతి సమీపంలోఉన్న ఘనసర, కీసర, కోసలి వాసులు కూడా బెంబేలెత్తిపోయారు. ఎటువైపు నుంచి ఏనుగులు వచ్చి దాడి చేస్తాయోనని తీవ్ర భయాందోళన చెందారు. మరోవైపు కొత్తూరు బీట్ ఆఫీసర్ కృష్ణారావు ఏనుగుల సంచారంపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని సూచిస్తున్నారు. ప్రస్తుతం 12 మంది ట్రాకర్స్ గజరాజుల సంచారాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఏదేమైనా ఈ ప్రాంతం నుంచి తక్షణమే ఏనుగులను తరలించాలని ఆయా గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- డీఎంహెచ్‌వో జగన్నాథరావు

పాలకొండ: హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు ఆదేశించారు. పాలకొండ, వీరఘట్టం మండలాలకు చెందిన పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో శనివారం పాలకొండలో సమావేశమయ్యారు. గర్భిణులుగా నమోదైనప్పటి నుంచి ప్రసవం జరిగే వరకు పూర్తిస్థాయి ఆరోగ్య పర్యవేక్షణ ఉండాలని, మొదటి త్రైమాసికంలోనే రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని ఆయన తెలిపారు. గర్భిణుల ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్‌లో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. మొదటి కాన్పుకు, ఆడబిడ్డ పుట్టిన రెండో కాన్పుకు పీఎంఎంవీవై పథకం ద్వారా రూ.5 వేలు, జేఎస్‌వై ద్వారా రూ.1000 జమ అవుతాయన్నారు. వైద్య పరీక్షల వివరాల ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పీహెచ్‌సీలో సాధారణ కాన్పులు జరిగేలా చూడాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, శిశువులు, కిశోర బాలికల్లో రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి నివారణా చర్యలు చేపట్టాలన్నారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ, డీహైడ్రేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించి జాగ్రత్తలు తెలియజేయాలని ఆదేశించారు. దీర్ఘకాలిక రోగులు, టీబీ వ్యాధిగ్రస్థులపైనా దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో డీఐవో నారాయణరావు, డీఎంవో జగన్మోహన్‌రావు, ఆర్‌బీఎస్‌కె ప్రోగ్రాం అధికారి రఘుకుమార్, ఏపీపీడీ ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, ఎపిడిమియాలజిస్ట్ శ్రీధర్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

అధికార పార్టీ నాయకుల హామీలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. అంతన్నారు.. ఇంతన్నారు అన్న చందంగా రాజాం నియోజకవర్గ ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎన్నికల ముందు ఎన్నెన్నో హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక పట్టించుకున్న పాపాన పోలేదు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా సక్రమంగా అమలు కాలేదని నియోజకవర్గ ప్రజలు వాపోతున్నారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు సిద్ధమవుతుండడంతో గతంలో వైసీపీ నాయకులు ఇచ్చిన హామీలను తలచుకుంటున్నారు.

హామీలు బోలెడు.. ఆచరణ జానెడు!



- గత ఎన్నికల ముందు భ్రమలు
- ఓటర్లను ఆకర్షించేందుకు రకరకాల వాగ్దానాలు
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం
- వైసీపీ నాయకుల హామీలన్నీ బుట్టదాఖలు
- నిరాశలో రాజాం నియోజకవర్గ ప్రజలు



చెరువును తలపిస్తున్న రాజాం పట్టణ ప్రధాన రహదారి (ఫైల్)

(రాజాం)

అధికార వైసీపీ నాయకుల హామీలు నీటిమూట లేనని తేటతెల్లమైంది. తమవన్నీ మాటల వరకే గాని ఆచరణలో ఉండవంటూ నిరూపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో రాజాం నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు. విజయనగరం జిల్లా రాజాం నుంచి శ్రీకాకుళం జిల్లా సంతకవిటిని కలుపుతూ 16 కిలోమీటర్ల రహదారి నిర్మాణం చేపడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. రెండేళ్ల కిందట రూ.50 కోట్లు మంజూరు చేసినట్టు ప్రకటించారు. కానీ పనులు మాత్రం ప్రారంభించలేదు. అటు శ్రీకాకుళం జిల్లా పొందూరు రోడ్డును కలుపుతూ ఉన్న ఈ రహదారిపై నిత్య మూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కానీ వైసీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి మొగ్గు చూపలేదు. రాజాం మునిసిపాల్టీ పరిధిలో రహదారుల నిర్మాణానికి ఏడాది కిందట ప్ర భుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. గుంటూరుకు చెం దిన ఓ కంపెనీ కాంట్రాక్టు పనులను దక్కించుకుంది. సుమా రు రూ.6 కోట్ల మేర పనులు పూర్తిచేసింది. కానీ ఒక్క రూ పాయి కూడా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో ఈ హామీ సైతం బుట్టదాఖలైంది. ఇవొక్కటే కాదు.. రాజాం నియోజకవర్గానికి ఇచ్చిన హామీలేవీ పూర్తిస్థాయిలో నెరవేరలేదు. ఆ దిశగా ప్రయత్నాలు కూడా జరగలేదు. రెండేళ్ల కిందట బొబ్బిలి రోడ్డు నుంచి గాయత్రీనగర్ వరకూ.. అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకూ రహదారి విస్తరణ, కాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. దీంతో పట్టణ స్వరూపమే మారిపోతుందని వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా ప్రకటించారు. టెండరు దక్కించుకున్న పృథ్వీ అనే సంస్థ పనులను ప్రారంభించింది. గత నవంబరు వరకూ సుమారు రూ.6 కోట్లతో పనులు చేపట్టింది. బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం మొండిచేయి చూపింది. దీంతో కాంట్రాక్టర్ పనులు చేయలేనని చేతులెత్తేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. కనీసం ఎందుకు పనులు నిలిపివేశారో అడిగే నాథుడు లేకపోయాడు. ఫలితంగా రాజాం నియోజకవర్గ ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.



మునిసిపాలిటీ రోడ్లు అధ్వానం

రాజాం మునిసిపాలిటీలో రహదారుల పరిస్థితిని ఎలా వర్ణించినా తక్కువే అవుతుంది. ముఖ్యంగా అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకూ రోడ్డులో ప్రయాణమంటే హడలెత్తిపోవాల్సిందే. అటువైపుగా వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో అయితే ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ రహదారి పరిస్థితిపై స్థానిక ఎమ్మెల్యే కంబాల జోగులును స్థానికులు నిలదీసిన సందర్భాలు కూడా ఉన్నా యి. అయినా సరే పరిస్థితిలో మార్పు రావడం లేదు. నిధులు పుష్కలంగా ఉన్నాయని చెబుతున్నారు. కానీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదు. ఈ కారణంతోనే పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

నూతన భవనమన్నారు..

దశాబ్ద కాలం కిందట రాజాం మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా మారింది. అక్కడి నుంచి మునిసిపాల్టీగా అవతరించింది. కానీ ఇప్పటివరకూ పాలకవర్గాలు లేవు. ఎన్నికలు జరగలేదు. దీంతో ప్రజాప్రతినిధులు లేరన్న సాకుతోనో.. మరే ఇతర కారణాలో తెలియదు కానీ.. కనీసం మునిసిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి కూడా నోచుకోలేదు. గత ఎన్నికల్లో వైసీపీ నూతన భవన నిర్మాణానికి హామీ ఇచ్చింది. కానీ ఐదేళ్లలో కనీసం స్థలం కేటాయింపు, స్థల పరిశీలన కూడా జరగని పరిస్థితి.

నాగావళిపై వంతెన ఎప్పుడో?

సంతకవిటి మండలం బసవలరేవు వద్ద నాగావళి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామానికి చెందిన ప్రజలు ఏడాది పాటు నిరాహార దీక్ష చేపట్టారు. అయితే వైసీపీ ప్రభుత్వం హయాంలో స్పీకర్ తమ్మినేని సీతారాం నిరాహార దీక్ష వద్దకు చేరుకొని వంతెన నిర్మాణం చేడతామని హామీయిచ్చి దీక్షను విరమింపజేశారు. అంతేకాకుండా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో కూడా బసవలరేవు వంతెన నిర్మాణం చేసి తీరుతామని హామీయిచ్చారు. ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు దీంతో ఆయా గ్రామాల ప్రజలు నాగావళి నదిని దాటాలంటే పడవ ప్రయాణం చేయావాల్సిందే.

రాకపోకలకు అవస్థలు

రాజాం నుంచి వంగర వరకూ 20 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. జీఎంఆర్ ఐటీ నుంచి పాలకొండ వరకూ రహదారి విస్తరణ చేపడతామని కూడా చెప్పుకొచ్చారు. కానీ ఈ రెండు రహదారుల విషయంలో కనీస పురోగతి లేదు. దీంతో అటు పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇ బ్బంది పడుతున్నారు. పాలకొండ రహదారిలో అయితే నిత్యమూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మనుషుల ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. కనీసం ప్రతిపాదనలు కూడా పంపలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

డిగ్రీ కళాశాల ఒట్టి మాటే..

విద్యాపరంగా సైతం పెద్దగా కేటాయింపులు లేవు. నియోజకవర్గానికి ఒక డిగ్రీ కాలేజీ ప్రతిపాదన సైతం బుట్టదాఖలైంది. దీంతో స్థానిక విద్యార్థులు ప్రైవేటు కాలేజీల్లో చేరాల్సిన పరిస్థితి ఎదురైంది. నియోజకవర్గంలో కొత్తగా జూనియర్ కాలేజీల ఏర్పాటు, పాఠశాలల అప్‌గ్రేడ్ ప్రక్రియ సైతం సక్రమంగా జరగలేదు. గత ఎన్నికల ముందు వైసీపీ ఇచ్చిన హామీల్లో 80 శాతం వరకూ అమలుకు నోచుకోలేదు

'మడ్డువలస' ఊసే లేదు..

మడ్డువలస, తోటపల్లి ప్రధాన కాలువలు ఆధునీకరణ పనులు చేపడాతామని.. ఆయకట్టు రైతులకు పుష్కలంగా సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని రాజాంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో చేసిన వాగ్దానం బుట్టదాఖలైంది. ఆధునీకరణ పనులు చేపడతారని రైతులు సుమారు ఐదేళ్ల నుంచి ఎదురు చూడటమే తప్ప ఆచరణలో అమలు కావడం లేదు. అందుకు ప్రతి ఏటా సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు వర్షాలు పడితే తప్ప పంటలు పండే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

మడ్డువలస ప్రాజెక్ట్ →



పందెం నీదా.. నాదా?

- ఎన్నికల్లో విజయంపై జోరుగా బెట్టింగులు
- భారీగా 'పెట్టుబడి'


విజయనగరం (ఆంధ్రజ్యోతి)

'టీడీపీ అధికారంలోకి వస్తే... నువ్వు పొలం రాసివ్వాలి. వైసీపీ అధికారంలోకి వస్తే నీకు నేను రాసిస్తా... అదనంగా రూ.ఐదు లక్షల క్యాష్'.. ఇదీ చీపురుపల్లి నియోజకవర్గంలోని గరివిడి మండలంలోని ఓ గ్రామంలో టీడీపీ అభిమాని... వైసీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య పందెం.

... వచ్చే సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై జనానికి ఉన్న ఆసక్తికి.. తమ పార్టీల గెలుపుపై అభిమానులకు...నాయకులకు ఉన్న విశ్వాసానికి ఈ పందెం ఓ నిదర్శనం. అక్కడే కాదు. ఆ స్థాయిలో కాకపోయినా దాదాపు ప్రతి పల్లెలోనూ ఈ తరహా పందాలు సాగుతున్నాయి. 'మా పార్టీ అధికారంలోకి వస్తుందని ఒకరంటే... 'కాదు మా పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందని' మరొకరు అంటున్నారు...ఇలా పరస్పరం పందాలు కాసుకుంటున్నారు. దీని కోసం డబ్బుతో పాటు ఆస్తులూ పణంగా పెడుతున్నారు. వివిధ పార్టీల అభ్యర్థుల తరఫున ప్రచారంలో పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో వస్తున్న స్పందనను బట్టి ఓ అంచనాకు వస్తున్నారు. జిల్లాలోని 7 నియోజక వర్గాల పరిధిలో అన్ని చోట్లా టీడీపీ- వైసీపీలపై పందెంరాయుళ్లు 'పెట్టుబడి' పెడుతున్నారు. ఇక పట్టణాల్లోనూ ఈ తరహా పందాలు సాగుతున్నాయి.

కాకపోతే అవి కాస్తా 'కార్పొరేట్ స్టైల్‌లో ఉంటున్నాయి. ఓవైపు నామినేషన్ల ప్రక్రియ సాగుతుండడం...అభ్యర్థుల ప్రచార సరళి... వీటన్నిటినీ బేరీజు వేసుకొని పందాలకు దిగుతున్నారు. రూ.వేల నుంచి రూ.లక్షల వరకూ ఈ మొత్తాలు ఉంటున్నాయి. విజయనగరం పార్లమెంటుకు కూటమి తరఫున కలిశెట్టి అప్పలనాయుడు... వైసీపీ తరఫున బెల్లాన చంద్రశేఖర్ పోటీలో ఉన్నారు. వీరిద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు. దీంతో ఎవరు గెలుస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. వీరిద్దరిపై కూడా జోరుగా పందాలు సాగుతున్నాయి. ఇక విజయనగరం అసెంబ్లీ స్థానానికి కూటమి అభ్యర్థి అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు... వైసీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి బరిలో దిగారు. వీరిద్దరిపై కూడా ఎక్కువ మంది బెట్టింగులు కాస్తున్నారు. మున్ముందు ఇవి మరింత జోరందుకునే అవకాశాలు ఉన్నాయి.





అనగనగా.. శివరాంపురం

సెంటిమెంట్

సాలూరు రూరల్: కొత్త పని ప్రారంభించాలన్నా...కొత్త వస్తువు వాడాలన్నా... మంచి ముహూర్తం చూడడమో... తమకు నచ్చిన వారితో చేయించడమో చాలామందికి సెంటిమెంట్. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఎన్నికల బరిలో ఇదీ మరీ ఎక్కువగా ఉంటుంది. అలాంటిదే సాలూరు నియోజకవర్గంలోనూ నాయకులకు ఓ సెంటిమెంట్ ఉంది. ఏ పార్టీ నేతలైనా శాసనసభ ఎన్నికల్లో తొలుత శివరాంపురం నుంచే ఎన్నికల ప్రచారభేరి మోగించడం పరిపాటి. సాలూరు నియోజకవర్గ ప్రధాన కేంద్రానికి ఈశాన్య మూల శివరాంపురం ఉంది. శివరాంపురంలో ప్రచారానికి వచ్చిన వారు తొలుత కొత్త పోలమ్మ గుడిలో పూజలు చేయడం ఆచారం. అనంతరం శివాలయంలో పూజలు చేసి ప్రచారభేరిని మోగిస్తారు. ఈ గ్రామం నుంచి పార్టీ అభ్యర్థులు ప్రచారం ప్రారంభిస్తే కలిసొస్తుందని నమ్మకం. ప్రస్తుత ఎన్నికల్లో విజయాన్ని కాంక్షిస్తూ గత నెల 16న కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ప్రచారం మొదలు పెట్టారు. తొలుత అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం శివాలయంలోను, నాగదేవతకు పూజలు చేసి ప్రచార ఘట్టానికి తెరతీశారు. వైసీపీ అభ్యర్థి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర గత నెల 23న శివరాంపురం నుంచే తన ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏ పార్టీ వారైనా శివరాంపురంలోనే తొలి ఓటరును పలుకరించడం ఆచారంగా వస్తోంది.



శివరాంపురం గ్రామం

రేపు బేబీనాయన నామినేషన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్డీఏ నాయకులు

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ స్థానానికి ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) ఈ నెల 22న ఉదయం నామినేషన్ దాఖలు చేయనున్నారు. స్థానిక దర్బారు మహల్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. పెద్దలు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం సోమవారం ఉదయం 9 నుంచి 10.30 గంటల లోపు ముఖ్య నాయకులతో కలిసి నామినేషన్ పత్రాలను సమర్పిస్తామని చెప్పారు. మధ్యాహ్నం 3.30 గంటల తరువాత బొబ్బిలి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామని బేబీనాయన తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మరిశర్ల రామారావునాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, జనసేన రాష్ట్ర కార్యనిర్వహణా కార్యదర్శి పాలూరు బాబు, టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు పాల్గొన్నారు.

సార్లూ.. చూస్తున్నారా?

- ఐదుగురు కాదు.. 30 మంది వెళ్లిన వైనం
- కోలగట్ల నామినేషన్ కార్యక్రమంలో ఇదీతీరు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 20: వైసీపీ నాయకులు ఎన్నికల నిబంధనలు గాలికొదిలారు. ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కూడా పట్టించుకోలేదు. అధికార పార్టీ వారు కావడంతో పోలీసులు కూడా చూసీచూడనట్టు వదిలేశారు. నిబంధనల ప్రకారం విజయనగరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే ముందు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అంతవరకు ఎంతమంది వెళ్లినా.. ఇబ్బంది లేదు. బారికేడ్ దాటే సమయంలో నామినేషన్ వేసే వ్యక్తితోపాటు, ఐదుగురికి మాత్రమే అవకాశం ఉంది. శనివారం విజయనగరం వైసీపీ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి నామినేషన్ వేశారు. అయితే ఆయనతో పాటు 30 మంది వరకు బారికేడ్లు దాటుకుని లోపలకు వెళ్లిపోయారు. కొంతమంది పోలీసులు చూస్తున్నా.. ఒకరిద్దరు మాత్రం వైసీపీ నేతలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ వైసీపీ నాయకులు వారిని పట్టించుకోకుండా ముందుకు సాగిపోయారు.



నామినేషన్ వేసేందుకు కోలగట్ల వెంట గుంపుగా వెళ్తున్న వైసీపీ నాయకులు

జన కేతనం
ఆంధ్రజ్యోతి ఆదివారం 21 ఏప్రిల్ 2024

ఇప్పటి వరకు 15 సార్వత్రిక ఎన్నికలు

మీకు తెలుసా?

విజయనగరం: ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు 15 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి.1952 నుంచి 2014 వరకు 14 సార్లు ఎన్నికలు నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో తొలిసారి రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 1957 ఫిబ్రవరి 25, 1962 ఫిబ్రవరి 19, 1967 ఫిబ్రవరి 8, 1972 మార్చి 15, 1978 ఫిబ్రవరి 25, 1983 మే 1, 1985 మే 3, 1989 నవంబరు 22, 1994 డిసెంబర్ 1, 1999 సెప్టెంబరు 18, 2004 ఏప్రిల్ 20, 2009 ఏప్రిల్ 16, 2014 ఏప్రిల్ 30, 2019 ఏప్రిల్ 11న ఎన్నికలను నిర్వహించారు.

72 ఏళ్ల చరిత.. ఎంతో ఘనత!

విజయనగరం జిల్లాలో ప్రాముఖ్యం కలిగిన నియోజకవర్గాల్లో చీపురుపల్లిది ప్రత్యేక స్థానం. 2009కి ముందు శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని మండలాలతో ఉన్న ఈ నియోజకవర్గం... ఆ తరువాత విజయనగరం జిల్లాలోని మండలాలతో కొత్తదనం సంతరించుకుంది. ఎందరో ప్రముఖులను శాసనసభకు పంపించింది.

- ఇదీ చీపురుపల్లి నియోజకవర్గం ప్రత్యేకత
- పాతికేళ్లకు పైగా సైకిల్‌కే ఓటు
- ఎందరో ఉద్దండులకు నిలయం

(చీపురుపల్లి)

జిల్లాలోని చరిత్ర కలిగిన నియోజకవర్గాల్లో చీపురువల్లి ఒకటి. 1952లో ఈ నియోజకవర్గం ఆవిర్భవించింది. ఇక్కడ తూర్పు కాపు సామాజిక వర్గం అధికంగా ఉంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు చీపురుపల్లిలో గరివిడి, శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు, జి.సిగడాం మండలాలు విలీనమై ఉండేవి. పునర్విభజన అనంతరం సిగడాం, పొందూరు రాజాం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోకి చేరగా, అప్పటి దాకా తెర్లాంలో ఉన్న మెరకముడిదాం మండలం, గజపతినగరంలో ఉన్న గుర్ల మండలాలు చీపురుపల్లిలో కలిశాయి. తాజా సమాచారం ప్రకారం ఇక్కడ 2,04,868 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గానికి రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైనదిగా గుర్తింపు ఉంది. గడిచిన 72 సంవత్సరాల్లో ఎంతో మంది ఈ నియోజకవర్గం నుంచి విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టారు. వీరిలో చాలా మందిని మంత్రి లేదా దానికి సమానమైన పదవులు వరించాయి. రాష్ట్ర స్థాయి రాజకీయాల్లో ప్రాధాన్యం ఉన్న వారు పోటీ చేసి గెలవడం వల్ల ఈ నియోజకవర్గానికి ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. 72 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ నియోజవర్గంలో 1983 వరకూ ఒక రకమైన రాజకీయాలు సాగగా... 1982లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారి పోయింది. అప్పటి నుంచి తెలుగు దేశం పార్టీకి కంచుకోటగా మారింది. ఎక్కువ కాలం పాటు తెలుగుదేశం పార్టీ జెండాయే ఇక్కడ రెపరెపలాడింది. ఇప్పటి వరకూ ఈ నియోజకవర్గానికి 11 మంది నాయకులు 14 అసెంబ్లీలకు ప్రాతినిధ్యం వహించగా, వారిలో రెండుసార్లు ఎమ్మెల్యే పదవిని చేజిక్కించుకున్న వారు ఇద్దరే. ఆ అరుదైన రికార్డు గద్దే బాబూరావు, బొత్స సత్యనారాయణలకు మాత్రమే దక్కింది.


తాడ్డె చిన అచ్చెన్నాయుడు


తాడ్డె రామారావు


త్రిపురాన వెంకటరత్నం


కోట్ల సన్యాసప్పల నాయుడు


గద్దే బాబూరావు


బొత్స సత్యనారాయణ


కిమిడి మృణాళిని

1952 నుంచి ఎమ్మెల్యేలుగా..

1952లో జరిగిన తొలి ఎన్నికల్లో తాడ్డె అచ్చెన్నాయుడు గెలుపొందారు. 1957లో ఎం.సత్యనారాయణరాజు, 1962లో కోట్ల సన్యాసప్పలనాయుడు (సోషలిస్టు), 1967లో ఇండిపెండెంట్‌గా తాడ్డె రామారావు, 1972లో కాసు కాంగ్రెస్ తరపున రౌతు పైడపునాయుడు (పోలినాయుడు) గెలిచారు. 1978లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చిగిలపల్లి శ్యామలరావు విజయం సాధించారు. అనంతరం తెలుగు దేశం పార్టీ ఆవిర్భవించాక... 1983లో త్రిపురాన వెంకటరత్నం, 1985లో కెంబూరి రామ్మోహనరావులు గెలుపొంది చీపురుపల్లిలో తెలుగుదేశం పార్టీకి గట్టి పునాదులు వేశారు. 1989, 94లో కూడా అదే పార్టీ తరపున వరుసగా రెండుసార్లు గద్దే బాబూరావు గెలిచారు. 1999, 2004 సంవత్సరాల్లో బొత్స సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ తరపున వరుసగా గెలిచారు. తిరిగి 2014లో అనూహ్యంగా చీపురుపల్లి టికెట్ దక్కించుకున్న కిమిడి మృణాళిని బొత్సపై విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో బొత్స సత్యనారాయణ ఈ నియోజకవర్గంలో మూడోసారి గెలుపొందారు.


స్వరూపం మారింది

2009 తరువాత నియోజకవర్గాల పునర్విభజన అనంతరం, గుర్ల, మెరకముడిదాం, గరివిడి, చీపురుపల్లి మండలాలతో ఈ నియోజకవర్గం కొత్త రూపును సంతరించుకుంది. అంతకుముందు ఈ నియోజకవర్గంలో విజయనగరం జిల్లాకు చెందిన చీపురుపల్లి, గరివిడి మండలాలతో బాటు అప్పటి శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి.సిగడాం, పొందూరు మండలాలు ఉండేవి. అప్పటి వరకూ తెర్లాం నియోజక వర్గంలో ఉన్న మెరకముడిదాం మండలాన్ని చీపురుపల్లి నియోజకవర్గంలో విలీనం చేసి.. జి.సిగడాం, పొందూరు మండలాల ను తిరిగి శ్రీకాకుళం జిల్లాలోని రాజాం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో చేర్చారు.

12 మందిలో ఐదుగురు టీడీపీ వారే...

ఇప్పటి వరకూ ఈ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన నాయకులు 11 మంది కాగా... వారిలో ఐదుగురు తెలుగుదేశం పార్టీకి చెందిన వారే. 1983లో దివంగత ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించాక.. మొదటి సారిగా ఆ పార్టీ తరఫున త్రిపురాన వెంకటరత్నం విజయబావుటా ఎగుర వేసి ... కేబినెట్‌లో మంత్రి పదవి చేపట్టారు. ఆ తరువాత 1984లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి కెంబూరి రామ్మోహనరావు గెలిచారు. 1989లో టంకాల సరస్వతమ్మ, 1994, 99లో గద్దే బాబూరావులు అదే పార్టీ నుంచి ఎన్నికయ్యారు. ఆ తరువాత 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున బొత్స సత్యనారాయణ గెలిచారు. తిరిగి 2014లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడి ఓటర్లు తెలుగుదేశం పార్టీ తరఫున బరిలో దిగిన కిమిడి మృణాళినిని గెలిపించి, తెలుగుదేశం పార్టీపై తమకున్న అభిమానాన్ని మరోమారు చాటుకున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మూడో సారి బొత్స సత్యనారాయణ గెలుపొందారు.


చీపురుపల్లి నియోజకవర్గ ముఖచిత్రం



చీపురుపల్లి నియోజకవర్గం మ్యాప్


ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కనక మహాలక్ష్మి అమ్మవారు..


చీపురుపల్లి పట్టణ శివారులో అమ్మవారి ఆలయం

కూటమి కోసం యాత్ర

- నాగార్జునసాగర్‌కు చెందిన వ్యక్తి ప్రయత్నం

రాజాం రూరల్: తెలుగుదేశం. జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ పల్నాడు జిల్లా నాగార్జున సాగర్‌కు చెందిన పత్తిపాటి నాగబాలాజీ నాగార్జున సాగర్ నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకూ ద్విచక్ర వాహనంపై యాత్రను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా రాజాం కూటమి అభ్యర్థి కోండ్రు మురళిని శ్యాంపురంలో కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలన పోవాలన్నారు. జగన్ అయిదేళ్ల పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందన్నారు. సంక్షేమం మరుగున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పర్యటిస్తున్న ప్రాంతాలలో పోటీలో ఉన్న కూటమి అభ్యర్థులను గెలిపించాలని పట్టణాలు, గ్రామాలలో ప్రచారం చేస్తున్నానని నాగబాలాజీ వివరించారు.


ద్విచక్ర వాహనంపై ప్రచారం చేస్తున్న నాగబాలాజీ

సిరా చరిత్ర తెలుసా?

- ఎన్నికల్లో ఇదే ముఖ్యం
- ఎడమచేతి చూపుడు వేలి గోరుపై వేస్తారు
- ఇది ఉంటే ఓటు హక్కును వినియోగించుకున్నట్లే..

(విజయనగరం రూరల్)

ఓటు వేశారా? అంటే నోటితో సమాధానం చెప్పనవసరం లేదు. నేరేడు రంగులో ఉన్న సిరా గుర్తున్న వేలుని చూపిస్తే చాలు. సిరా చుక్కకు, ఓటుకు ఉన్న సంబంధం అటు వంటిది. ఈ సిరా వేస్తేనే ఓటు హక్కు వినియోగించుకున్నట్లు గుర్తింపు ఉంటుంది. ఓటు వేసిన పౌరులకు ఆ సిరా ఎక్కడ తయారవుతోందోనన్న సందేహాలు ఉంటాయి.

మైసూర్‌లో పరిశ్రమ..

కర్ణాటకలోని మైసూర్‌లో గల రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని రంగులు వార్నీష్ పరిశ్రమ ఎన్నికల సమయంలో చేతి వేలికి వినియోగించే సిరాను తయారుచేస్తోంది. దేశంలోని అన్నిరాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరిగే అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలకు ఇక్కడి నుంచే సిరా సరఫరా అవుతోంది. 1962 సార్వత్రిక ఎన్నికల నుంచి మైసూర్ పెయింట్స్ వార్నిస్ కర్మాగారం ఉత్పత్తి చేస్తున్న చెరిగిపోని సిరానే వినియోగిస్తున్నారు. ఈసారి కూడా అక్కడి నుంచే సిరాను సరఫరా చేయనున్నారు.

తొలుత లక్క.. ఆ తర్వాత పెయింట్లు

1937లో అప్పటి మైసూర్ మహారాజు నాల్మడి కృష్ణరాజు వడయార్ ఈ సిరా తయారీ కర్మాగారాన్ని స్థాపించారు. అప్పట్లో దీని పేరు మైసూర్ లాక్ అండ్ పెయింట్స్ వర్క్స్‌గా ఉండేది. 1989లో దీని పేరును మైసూర్ పెయింట్స్ అండ్ వార్నీస్ సంస్థగా మార్చారు. స్వాతంత్ర్యానికి ముందు వరకు మైసూర్ రాజుల స్వాధీనంలో ఉండేది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇక్కడ తొలుత సీళ్ల వేసుందుకు కావాల్సిన లక్క తయారీకి ఈ పరిశ్రమను స్థాపించారు. చెట్ల నుంచి వచ్చే జిగురు తీసుకొచ్చి దానికి ఇతర అటవీ ఉత్పత్తులను కలిపి లక్కగా మార్చి రాజముద్రను వేసేందుకు మైసూరు రాజులు ఉపయోగించేవారు. జిగురు సరఫరా తగ్గిపోవడంతో లక్కకు బదులుగా చెట్ల పసరు ఆధారంగా పెయింట్ల తయారీని ప్రారంభించారు. 1962లో ఒక ఓటరు పలుమార్లు ఓటు వేయకుండా నిరోధించేందుకు చెరిగిపోని సిరాను ఉత్పత్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నేషనల్ ఫిజికల్ లాబోరేటరీస్ ఫార్ములాతో సిరా ఉత్పత్తి బాధ్యతను ఈ కర్మాగారానికి అప్పగించారు.

మొదట్లో ఓటేసిన వ్యక్తికి ఎడమచేతి చూపుడు వేలిపై సిరా చుక్కను పెట్టేవారు. 2006 ఫిబ్రవరి నుంచి

ఎందుకు చెరగదంటే ..

ఓటర్ల ఎడమ చేతి వేలి గోరుపై సిరాను గీతగా పెడుతున్నారు. సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉన్నందున వెంటనే చెరిగిపోదు. ఈ సిరా నేరేడు పండు రంగులో ఉంటుంది.



'ఘాటు' రోడ్డు!

నేతలూ చూడండి

గుమ్మలక్ష్మీపురం: కేదారిపురం నుంచి వంగర గ్రామానికి వెళ్లే ఘాట్ రోడ్డుపై పట్టపగలే చుక్కలు కనిపిస్తాయి. ఈ రహదారికి మరమ్మతులు చేయాలని బంగారకేసర, కీసరగూడ, డోలుకొన గ్రామస్థులు కోరుతున్నారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు ఈ రహదారిలో కొంతభాగం దెబ్బతింది. ఈ కారణంగా వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. ఆ తర్వాత ఓ ప్రాంతంలో కూరుకుపోయిన రహదారిని మరమ్మతులు చేసి రిటైనింగ్ వాల్ నిర్మించారని... మట్టి ఫిల్లింగ్ చేసి సిమెంట్ రోడ్డు వేశారని స్థానికులు చెబుతున్నారు. మట్టి కుంగిపోయి... సిమెంట్ రోడ్డు పగిలిపోయిందని... దీనికి వెంటనే మరమ్మతులు చేయాలని వీరు కోరుతున్నారు. పార్వతీపురం నుంచి కీసరవెల్లికి ఆర్టీసీ బస్సు ఈ రహదారిపై నుంచి వెళ్తుందని స్థానికులు తెలిపారు. రోడ్డు మరమ్మతులకు గురవడంతో బస్సు నడపడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఈ రహదారిని చూసినా...మెరుగుపరిచే ఆలోచన చేయలేదని ఈ ప్రాంత గిరిజనులు ఆరోపిస్తున్నారు. అధికారులు...నాయకులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు.


పగిలిన సిమెంట్ రహదారి

పెద్దగెడ్డకు మోక్షమెప్పుడు?

నెరవేరని హామీ

పాచిపెంట: పెద్దగెడ్డ ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మాణం ఎప్పుడు జరుగుతుందోనని రైతులు ఎన్నో ఏళ్లుగా... ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. ఎడమ కాలువ నిర్మిస్తే పద్మాపురం, పెద్దవలస ఈతమానువలస, బొబ్బిలివలస, సీతంపేట, తదితర గ్రామాలకు చెందిన సుమారు 4 వేల ఎకరాలకు సాగునీరందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీని కోసం అనేకసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించారు. గత ఎన్నికల సమయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రాజన్నదొర హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఎడమ కాలువ నిర్మించలేదు.


పెద్దగెడ్డ ప్రాజెక్టు స్పిల్‌వే

శిథిలావస్థలో రక్షణ గోడ

- ప్రమాదకరంగా వెంగళరాయసాగర్ ప్రధాన కాలువపై కాజ్‌వే
- పొంచి ఉన్న ప్రమాదం

మక్కువ: మండలంలోని మోసూరువలస, మూకవలస గ్రామాలకు వెళ్లే రహదారిలో వెంగరాయసాగర్ ప్రధాన కాలువపై ఉన్న కాజ్‌వే రక్షణ గోడ శిథిలావస్థకు చేరుకుంది. సంవత్సరాలు గడుస్తున్నా నిర్మించే నాథుడే కరువయ్యాడు. ఆయా గిరిజన గ్రామాల ప్రజలు ఆటోలు, ద్విచక్ర వాహనాలతో ఈ దారి గుండానే రాకపోకలు సాగిస్తారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా వాహనం అదుపు తప్పి వీఆర్ఎస్ కాలువలో పడి తీవ్ర గాయాలపాలయ్యే ఆస్కారం ఉంది. రక్షణ గోడ శిథిలావస్థకు చేరడంతో సిమెంట్‌లో ఉన్న ఇనుప సామగ్రిని కూడా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి రక్షణ గోడకు మరమ్మతులు నిర్వహించాలని గిరిజన గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఉన్న కాజ్‌వే రక్షణగోడ

విద్యుదాఘాతంతో రైతు మృతి


అప్పలనాయుడు (ఫైల్)

పాలకొండ: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన విజయనగరం జిల్లా రేగిడి మండలంలో శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి రేగిడి ఏఎస్ఐ రాజారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొండ మండలం అంపిలి గ్రామానికి చెందిన అలుబిల్లి అప్పల నాయుడు(58) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను సమీప గ్రామమైన రేగిడి మండలం బొడ్డవలసలో ఉన్న సొంత పొలంలో చెరకు సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం పంటకు నీరు కట్టేందుకు వచ్చి మోటార్ వేయడానికి ప్రయత్నిస్తుండగా కింద ఉంద ఉన్న కరెంట్ వైరును గుర్తించక అడుగు వేయడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెనుక నుంచి గమనించిన కుమా రుడు శంకరరావు గట్టిగా కేకలు వేయడంతో దగ్గరలో ఉన్నవారంతా వచ్చి రక్షించే ప్రయత్నం చేయగా అప్పటికే అప్పలనాయుడు మృతి చెందాడు. మృతుడికి భార్య నాగమని, కొడుకు శంకరరావు, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని రా జాం ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించా రు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ రాజారావు తెలిపారు.

సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు


ప్రజారోగ్యశాఖ అధికారికి సమస్యను వివరిస్తున్న శంకరరావు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని కొత్తవలస 4వ సచివాలయంలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్ చిరంజీవి, ఇతర సిబ్బందిపై నర్సిపురం గ్రామానికి చెందిన పూడి శంకరరావు అనే ఉపాధ్యాయుడు శనివారం ప్రజారోగ్యశాఖ వివాహ ధృవీకరణ పత్రాల మంజూరు అధికారి రామారావు, కమిషనర్ కె.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. శంకరరావు తన కుమార్తె వివాహ ధ్రువీకరణ పత్రం కోసం శనివారం కొత్తవలస 4వ సచివాలయానికి వెళ్లారు. అక్కడ ఉన్న డిజిటల్ అసిస్టెంట్ చిరంజీవి.. వివాహ ధ్రువీకరణ పత్రం కోసం కావాల్సిన సర్టిఫికెట్లను సాయంత్రం 5గంటల లోగా తీసుకురావాలని చెప్పారు. ఆయన చెప్పినవిధంగానే శంకరరావు సాయంత్రం సర్టిఫికెట్లు తీసుకు వెళ్లారు. అయితే అప్పటికి అక్కడ డిజిటల్ అసిస్టెంట్ కనిపించలేదు. సార్ లేరా.. అని అక్కడ ఉన్న సిబ్బందిని అడగ్గా, వారు సమాధానం చెప్పలేదు. దీంతో శంకరరావు తమలాంటి ఉపాధ్యాయులకే ఇలా తిప్పిస్తే.. మిగతావారి సంగతి ఏంటి అని అక్కడ ఉన్న సిబ్బందిని ప్రశ్నించారు. ఇంతలో పక్క గదిలోనే ఉన్న డిజిటల్ అసిస్టెంట్ చిరంజీవి అక్కడకు వచ్చారు. ఆయనతో పాటు సచివాలయ సిబ్బంది రాఘవ, మరో వ్యక్తి- శంకరరావుపై దాడి చేయబోయారు. వెంటనే శంకరరావు అక్కడి నుంచి వచ్చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ప్రజారోగ్యశాఖ వివాహ ధృవీకరణ పత్రాల మంజూరు అధికారి రామారావు, కమిషనర్ కె.శ్రీనివాసరావులకు ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయుడు శంకరరావు ఫిర్యాదు మేరకు సమగ్ర దర్యాప్తు చేపట్టి తగిన చర్యలు చేపడతామని చెప్పారు.

ఇంటి బాట పట్టిన ఆశ్రమ విద్యార్థులు


ఇళ్లకు వెళ్తున్న మామిడిపల్లి ఆశ్రమ పాఠశాల బాలికలు

సాలూరు రూరల్: పాఠశాల విద్యార్థులకు ఎస్ఏ 2 పరీక్షలు ఈనెల 19తో ముగిశాయి. దీంతో సాలూరు మండలంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు శనివారం ఇంటిబాట పట్టారు. పరీక్షలు ముగియడంతో పాటు ఈనెల 21న ఆదివారం కావడంతో తదుపరి కేవలం రెండు రోజులు పనిదినాలు ఉన్నా ఎటువంటి బోధనా కార్యక్రమాలు ఉండవని తల్లిదండ్రులు కూడా ఆశ్రమ పాఠశాలలకు వచ్చి తమ పిల్లలను ఇళ్లకు తీసుకు వెళ్తున్నారు. సాలూరు మండలంలో మామిడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, తోణాం, అంటివలస, కొత్తవలస, మావుడి, కురుకూటి తదితర ఆశ్రమ పాఠశాలల నుంచి 52 శాతం మందికి పైగా విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. ఆశ్రమ పాఠశాలల్లో కొద్దిమంది విద్యార్థులు మాత్రమే మిగిలారు.

యువకుడి ఆత్మహత్య


ఈశ్వరరావు (ఫైల్)

మెంటాడ: యువకుడు ఆత్మహత్య చే సుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఆంధ్ర ఎస్ఐ దేవి తెలిపిన వివరాలు ఇలా ఉ న్నాయి. మండలంలోని పెదమేడపల్లి గ్రామానికి చెందిన కిల్లాడ ఈశ్వరరావు (30) మండలంలో ఒక బ్యాంకుకు సం బంధించిన కస్టమర్ సర్వీస్ పాయింట్(సీఎస్పీ) ను నిర్వ హించేవాడు. అయితే కొద్ది కాలంగా ఆ విధులకు దూరంగా ఉన్న ఈశ్వరరావు శుక్రవారం పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఈశ్వర రావును గుర్తించిన స్థానికులు, కుటుంబ సభ్యు లు విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తమ కుమారుడి ఆత్మహత్యకు ఆర్థిక సమస్యలే కార ణమని తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నట్టు ఎస్ఐ దేవి తెలిపారు. ఇలా ఉండగా ఈశ్వరరావు మృతిపై స్థానికంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీఎస్పీ నిర్వహిస్తున్న ఈశ్వరరావు కొద్దికాలంగా నిధుల దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమం లో విధులకు దూరంగా ఉంటున్నాడు. నిధుల విషయంలో తనపై రకరకాలుగా జరుగుతున్న ప్రచారంతో కలతచెంది ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని స్థాని కుల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భర్తను హత్య చేసిన భార్య


అప్పన్న (ఫైల్)

గరివిడి: మండలంలోని వెదుళ్లవలస గ్రామానికి చెందిన కొలుసు అప్పన్న(19) అనే వ్యక్తిని ఆయన భార్య దేవి తన తల్లిదండ్రులైన సన్యాసిరావు, ఎల్లమ్మ సహకారంతో శుక్రవారం అర్ధరాత్రి హత్య చేసింది. గత కొంతకాలంగా అప్పన్న, దేవిల మధ్య తరుచూ గొడవలు జరుగుతూ ఉన్నాయి. ఈనేపథ్యంలో అప్పన్నను పథకం ప్రకారం తన తల్లిదండ్రులతో కలిసి దేవి హత్య చేసింది. ముందుగా అప్పన్న తలపై బండరాయితో కొట్టి తర్వాత మెడకు చున్నీతో ఉరివేసి వేలాడదీశారు. విషయం తెలుసుకున్న చీపురుపల్లి సీఐ సీహెచ్ షణ్ముఖరావు, గరివిడి ఎస్ఐ ఎల్.దామోదరరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అప్పన్న, దేవిలకు సుమారు రెండేళ్ల పాప, నాలుగు నెలల బాబు ఉన్నారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను జిల్లాలో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాల్లో కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


కురుపాం: కేక్ కట్ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్


పార్వతీపురం: మాజీ ఎమ్మెల్సీ జగదీష్ కార్యాలయంలో..


సీతానగరం: లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు

పాలకొండ: అగ్నిమాపక వారోత్సవా లు శనివారంతో ముగి శాయి. ఈ మేరకు అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు స్థానిక అగ్నిమాపక కేంద్రంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయ మణి పాల్గొన్నారు. ఈసందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక అధికారి వివరించారు. అందుకు సంబంధించిన పరికరా లను ప్రదర్శించారు. ఈ కార్యక్ర మంలో డిగ్రీ కళాశాల విద్యార్థినులు, పరిసర ప్రాంతాల మహిళలు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. ● **పార్వతీపురం టౌన్:** అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగిఉండాలని పార్వతీపురం అగ్నిమాపక అధికారి పైడిరాజు అన్నారు. శనివారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే 101కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు.

రానున్నది కూటమి ప్రభుత్వమే: జయకృష్ణ


కుడ్డపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జయకృష్ణ

సీతంపేట: కుడ్డపల్లి గ్రామంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ శనివారం ప్రచారం చేశారు. రాష్ట్రంలో రానున్నది కూటమి ప్రభు త్వమేనని స్పష్టం చేశారు. కూటమి నాయకులు సవర తోట ముఖలింగం, ఆర్.రంగనాథం, గంట సుధ, నీలయ్య తదితరులు పాల్గొన్నారు. ● **పాలకొండ:** వాటపాగు పంచాయతీలో సుమారు 300 కుటుంబాలు శనివారం వైసీపీని వీడి జనసేనలో చేరాయి. వారిని ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వైసీపీ సర్పంచ్ వావిలపల్లి రాజారావు, వార్డు మెంబర్ పొదిలాపు రాజారావు, తదితరులు ఉన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏకలవ్య ప్రవేశ పరీక్ష

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ ప్రవేశ పరీక్షగాను 702 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 649 మంది హాజరు కాగా, 53 మంది గైర్హాజరయ్యారని ఏటీడబ్ల్యూవో సురేష్‌కుమార్ తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షను ఎటువంటి లోటుపాట్లు లేకుండా పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పెంటన్న, భద్రగిరి, ఏపీ గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్, గుమ్మలక్ష్మీపురం ఏటీడబ్ల్యూవో బి.సురేష్‌కుమార్ పర్యవేక్షించారు.

● **సీతంపేట:** సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న భామిని, మెళియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు శనివారం స్థానిక బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ప్రవేశ పరీక్షకు 490 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 451 మంది హాజరైనట్టు ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర తెలిపారు. ఈ పరీక్షల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భామిని ఏకలవ్య ప్రిన్సిపాల్ సురేష్, గురుకులం సెల్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం: జవాబుపత్రాలను కట్టలు కడుతున్న దృశ్యం


సీతంపేట: పరీక్షలను పరిశీలిస్తున్న డీడీ అన్నదొర

టీడీపీలో 50 కుటుంబాల చేరిక

సాలూరు: పట్టణంలోని నాలుగో వార్డులో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. సాలూరులోని కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ఇంటి వద్ద శనివారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పార్టీ నాయకుడు కొనిసి చిన్ని ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో గోండెల శారద, ప్రసాద్, పరమేశ్, పర్తాపు సామయ్య, సుమన్, కిరణ్, యజ్జల మజ్జి, సింగారపు రజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలంతా కృషి చేయాలి

సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ గెలుపునకు ప్రతిఒక్క కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎస్సీ, ఎస్టీ చైర్మన్ కొండారెడ్డి, నరహర వరప్రసాద్ కోరారు. సీతంపేటలో శనివారం స్థానిక టీడీపీ కార్యకర్తలతో వారు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో బిడ్డిక దమయంతి నాయుడు, బిడ్డిక చంద్రరావు, టీడీపీ మండల అధ్యక్షుడు తోట ముఖలింగం, మాజీ ఎంపీపీ లక్షుమయ్య, సవర మాలయ్య, హిమరిక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఇంటింటి ప్రచారం

వీరఘట్టం: మండలంలోని ఈనెల 21, 22 తేదీల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఎన్నికల ప్రచారం ఉంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా గ్రామా ల్లోని బూత్ ఇన్‌చార్జిలు, కుటుంబ సాధికార సారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు రావాలి

కొమరాడ: మన భవిష్యత్తు బాగుపడాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు రావాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్‌చంద్రదేవ్ అన్నారు. శనివారం అర్తం గ్రామంలో పార్టీ మండల కన్వీనర్ ఉదయ్‌శేఖర్‌పాత్రుడు ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదినం నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మొండెంఖల్‌లో సీపీఎం అభ్యర్థి ప్రచారం

కురుపాం రూరల్: సీపీఎం తరఫున కురుపాం అసెంబ్లీకి పోటీ చేస్తున్న మండంగి రమణ శనివారం మొండెంఖల్, గోర్జిపాడు, ఉదయపురం తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. పార్టీ నాయకులు కోలక అవినాష్, ఊలక వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరో తరగతి ప్రవేశ పరీక్ష

మక్కువ: ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష సమయానికి అరగంట ముందుగా హాజరు కావాలన్నారు. సంబంధిత విషయాన్ని తల్లిదండ్రులు కూడా గమనించాలన్నారు.

బాబా మందిర శంకుస్థాపనకు ఆహ్వానం

భామిని: భామినిలో ఆదివారం షిర్డీసాయిబాబా మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు శనివారం ఆ గ్రామంలో భజనలు చేస్తూ ఇంటింటికి కరపత్రాలు అందించారు. పూజ్య గురుదేవులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, మందిర ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు.


ర్యాలీ చేస్తూ ఆహ్వానం పలుకుతున్న భక్తులు

కురిసింది వాన

సాలూరు రూరల్: సాలూరు ఏజెన్సీలో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో సేదతీరారు. సాలూరు ఏజెన్సీలో సాలూరు అర్బన్, రూరల్‌లో మామిడిపల్లి తదితర గ్రామాల్లో, పాచిపెంట, మక్కువ మండలాల్లో పలు చోట్ల మధ్యాహ్నం ఒంటిగంటన్నర తదుపరి వర్షం కురిసింది. సాలూరు ఏజెన్సీలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవగా, పాచిపెంటలో వడగళ్ల వాన కురిసింది. ● **మక్కువ:** మండలంలోని శనివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొన్ని చోట్ల వడగళ్ల వాన కురిసింది. ఈదురుగాలుల ప్రభావానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ● **పార్వతీపురం రూరల్:** బొడ్డవలసలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. సుమారు గంటపాటు వర్షం కురిసింది. లిడికివలసలో కూడా వర్షం పడింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉక్కపోత, అధిక వేడి ఉన్న సమయంలో ఈ వర్షం పడడంతో చిన్నారులు, వృద్ధులు ఊపిరిపీల్చుకున్నారు. ● **భామిని:** మండలంలో గత వారం రోజులుగా భానుడు భగభగమండుతుండగా శనివారం సాయంత్రం చిరుజల్లులు కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. ● **కొమరాడ:** ఉదయం అంతా ఎండవేడి, ఒక్కటే ఉక్కపోతతో అల్లా డుతున్న ప్రజానీకానికి ఒక్కసారి వాతావరణంలో మార్పులు చూసుకుని ఈదురుగాలలతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనాన్ని పొందా రు. మండలంలో పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.


సాలూరు రూరల్: సాలూరులో వర్షం కురుస్తున్న దృశ్యం



కాశీపూర్ సమితిలో బిజద కార్యకర్తల సదస్సు


మాట్లాడుతున్న భాస్కరరావు

రాయగడ: బిజూ జనతాదళ్ కొరాపుట్ ఎంపీ స్థానానికి, రాయగడ శాసన సభా స్థానానికి అధిష్ఠానం ఎంపిక చేసిన అభ్యర్థులను గెలిపించుకోవడం మనందరి బాధ్యత అని రాష్ట్ర మంత్రి అతాను సవ్యసాచి నాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాశీపూర్‌లో నిర్వహించిన కార్యకర్తల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. బిజూ జనతాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు ఈసందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలంతా ఐక్యమత్యంతో మెలిగి అభ్యర్థుల విజయానికి సైనికుల్లా కృషచేయాలని కోరారు. కార్యక్రమంలో బిజద సీనియర్ నాయకుడు కృష్ణచంద్ర మహాపాత్ర, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదిలి, కొరాపుట్ పార్లమెంటు అభ్యర్థిని కౌసల్యా హిక్కాక, రాయగడ శాసన సభ అభ్యర్థిణి అనసూయమాఝి, కార్యకర్తలు పాల్గొన్నారు. సుమారు 5వేల మంది గ్రామ పంచాయతీ కార్యకర్తలు, మద్దతుదారులు, హాజరై తమ సంఘీభావం తెలిపారు.

వైభవంగా మజ్జిగౌరి చైత్రోత్సవాలు


బంగారు నగలతో అమ్మవారు

రాయగడ: ఈనెల 19న ప్రారంభమైన ఉత్కళాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం మజ్జిగౌరి దేవి అమ్మవారి చైత్రమాసపు పూజలు అత్యంత వేడుకగా జరుగుతున్నాయి. ప్రతిరోజు కళశారాధన, సూర్యపూజలు, చండీపూజలను గంజాం జిల్లా నుంచి వచ్చిన పండితులు భక్తిశ్రద్ధలతో ఆగమ శాస్త్రానుసారం నిర్వహిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలయిన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. చైత్రోత్సవం సందర్భంగా అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనం కోసం వస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ట్రస్టీ అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు రవాణా సౌకర్యం కోసం రైల్వే స్టేషన్ వద్ద బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. మందిరంతో పాటు పరిసరాలను విద్యుద్దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈనెల 23 వరకు చైత్రోత్సవాలు జరుగుతాయని ఆలయ ట్రస్టీ తెలిపారు.

ఒడిశా

రాయగడలో భారీ వర్షం

రాయగడ: రాయగడ జిల్లాలో శనివారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన వర్షం సుమారు గంటన్నర పాటు ఏకధాటిగా కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.